క్లుప్తంగా

వైద్యుల సమ్మెకు సంఘీభావం



వైద్యుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న గౌరీదేవిపేట పీహెచ్‌సీ సిబ్బంది

ఎటపాక: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చేపట్టిన సమ్మెకు ఆయా పీహెచ్‌సీల సిబ్బంది సోమవారం సంఘీభావం తెలిపారు. గౌరీదేవిపేట, నెల్లిపాక, లక్ష్మీపురం పీహెచ్‌సీల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ లక్ష్మి, ఎల్‌టీ రామలక్ష్మి, ఫార్మాసిస్ట్ రమాదేవి, సిబ్బంది రామకృష్ణ, నవీన్, అనిత, మంగ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ



టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు

రాజవొమ్మంగి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం ఎ.ఆదిలక్ష్మి సోమవారం చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను జిల్లా కమిటీ తరఫున తోటి ఉపాధ్యాయులు సోమవారం ఆవిష్కరించారు. ఏపీ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18న పాఠశాల, నవంబర్ ఒకటో తేదీన మండల స్థాయిలో జరిగే చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని హెచ్‌ఎం ఆదిలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అల్లూరి జిల్లా అధ్యక్షుడు టి.బొజ్జయ్య, సైన్స్ టీచర్ ఎం.శాంతిప్రియ, ఉపాధ్యాయులు హరిశ్చంద్ర ప్రసాద్, సత్యాబాబు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు

ఎటపాక: ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు ఇచ్చారు. మండలంలో 30 మంది సోమవారం తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరారు. ముందుగా ఎంఈవోలకు జాయినింగ్ రిపోర్టు అందజేశారు.
కొయ్యూరు: కొత్త డీఎస్సీలో ఎంపికైన 38 మందిని కొయ్యూరు మండలానికి కేటాయించారు. వారి నుంచి నియామక పత్రాలను ఎంఈవో రాంబాబు తీసుకున్నారు. కేటాయించిన గ్రామాలకు వెళ్లి విధుల్లో చేరాలని సూచించారు.
ముంచంగిపుట్టు: కొత్త ఉపాధ్యాయులు 46 మంది సోమవారం విధుల్లోకి చేరారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో కోడా కృష్ణమూర్తి నియామక పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు అనిల్‌కుమార్, హరి, ఈశ్వర్, సురేష్, గౌరీశంకర్ పాల్గొన్నారు.
పెదబయలు: మండలంలో కొత్తగా 42 మంది ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోలు కృష్ణమూర్తి, పుష్పాల చేతుల మీదుగా నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేశారు.

16న మండల సర్వసభ్య సమావేశం



ఎంపీడీవో ధర్మారావు

ముంచంగిపుట్టు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 16న నిర్వహించనున్నామని ఎంపీడీవో కె.ధర్మారావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరు కావాలన్నారు. ముఖ్యంగా అన్ని శాఖల అధికారులు గత మూడు నెలల జరిగిన అభివృద్ధి పనులపై పూర్తి స్థాయి సమాచారంతో విధిగా హాజరు కావాలని, గైరాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

లింగ అసమానతలు నిరోధించాలి

నర్సీపట్నం:లింగ అసమానతలను నిరోధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక భద్రత, విద్యా అవకాశాలను కల్పిస్తున్నాయని ఆర్డీవో వి.వి.రమణ పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బాలిక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్డీవో మాట్లాడుతూ ఆడపిల్లలు కోసం ప్రభుత్వాలు సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టాలన్నారు. బాల్య వివాహాలు, వేధింపులు, లింగ ఆధారిత హింస వంటి ఘటనలు నిరోధానికి అనేక చట్టాలు ఉన్నాయన్నారు.

వైద్యుల రిలే దీక్షలకు సంఘీభావం

రోలుగుంట : గత నెల 30 తేదీ నుంచి తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోరుతూ దశల వారీగా గ్రామస్థాయి, మండలస్థాయి, నియోజకవర్గం, జిల్లా , రాష్ట్రసాయితో తొలుత విధులు నిర్వహిస్తూ ఆందోళన చేశారు. ప్రభుత్వం దిగిరాని నేపథ్యంలో కొన్ని రోజులుగా తూర్పు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ధర్నాచౌక్‌లో పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీల్లో పని చేస్తున్న పారా మెడికల్ సిబ్బంది సోమవారం నల్లబాడ్జీలు ధరించి దీక్షలు చేపట్టిన వైద్యులకు సంఘీభావం తెలిపారు.



గన్నెల గ్రామంలో శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్



హట్టుగుడలో నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్

నిలువ నీడ లేక.!

- శిథిలావస్థలో బస్ షెల్టర్లు
- ఎండకు, వానకు ప్రయాణికుల అవస్థలు



పానిరంగినిలో అధ్వానంగా ఉన్న బస్ షెల్టర్

రోడ్డుపైనే నిరీక్షిస్తున్నాం..



గన్నెల గ్రామంలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం బస్ షెల్టర్ పశువులకు, కుక్కలకు స్థావరంగా మారింది. ప్రయాణికులు కనీసం నిలబడేందుకు వీలు లేని విధంగా తయారైంది. దీంతో ప్రయాణికులు రోడ్డు పక్కనే ఉన్న చెట్టు నీడన బస్సులు, ఆటోల కోసం నిరీక్షిస్తున్నారు. బస్ షెల్టర్‌కు మరమ్మతులు చేపట్టాలి.
– శెట్టి ఆనందరావు, గన్నెల గ్రామం, అరకులోయ మండలం

అరకులోయటౌన్: ఏజెన్సీ ప్రాంతంలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరాయి. ప్రయాణికులు నిరీక్షించాల్సిన బస్ షెల్టర్లు మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం బస్ షెల్టర్ల పరిసరాలు పిచ్చిమొక్కలు పెరిగిపోయి ప్రయాణికులకు వెక్కిరిస్తున్నాయి. ప్రతి రోజు మండల కేంద్రాలతో పాటు మైదాన ప్రాంతానికి రాకపోకలు సాగించే ప్రయాణికులు వర్షా కాలంలో వానకు తడిచి, ఎండకు ఎండుతూ నిరీక్షిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో పిల్లా పాపలతో బిక్కుబిక్కుమంటూ శిథిలావస్థలో ఉన్న షెల్టర్లలో నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని హట్టగుడ, గన్నెల, బెంజిపూర్, లోతేరు, పానిరంగిని, యండపల్లివలస, గన్నెల జంక్షన్, తదితర గ్రామాల్లోని బస్ షెల్టర్‌లు శిథిల స్థితికి చేరి నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి పాడైన బస్ షెల్టర్లకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈగల్ టీం సీఐ, కొయ్యూరు సీఐ, ఎస్‌ఐలు

కొయ్యూరు: దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకమని కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు, చింతపల్లి ఈగల్ టీం సీఐ ఎస్.నారాయణ అన్నారు. చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. కొయ్యూరు బాలుర పాఠశాలల్లో సోమవారం డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావితరాలకు మార్గదర్శకులుగా ఉండాల్సిన విద్యార్థులు గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయి పండించినా, రవాణా చేసినా, కలిగి ఉన్నా శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. గంజాయికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా 1972 నెంబర్‌కు ఫోన్ చేయాలని వారు సూచించారు. ఫోన్ నంబర్ 89777 819782కు కూడా చెప్పవచ్చన్నారు. సైబర్ క్రైమ్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు, మంప ఎస్‌ఐలు కిషోర్‌వర్మ, శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు వినతి



ఏపీవోకు వినతిపత్రం అందచేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

చింతూరు: స్థానిక అటవీ శాఖకు చెందిన భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు సోమవారం ఐటీడీఏ ఏపీవో రామతులసికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ ఎర్రంపేటలో నిబంధనలు అతిక్రమించి నిర్మించిన బహుళ అంతస్తుల భవనాన్ని వెంటనే కూల్చివేయాలని, అటవీ శాఖ భూములను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై కూడా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ చట్టాలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోకపోవడంతో ఆక్రమణలు పెరిగిపోతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ డివిజన్ అధ్యక్షుడు కూర చిట్టిబాబు, కారం సీతారామయ్య, ఉయిక రత్తయ్య, సీతయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు సాయం



కార్యకర్త కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాడేరు : అనారోగ్యం బారిన పడిన ఇరడాపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త, పీఏసీఎస్ మాజీ చైర్మన్ తమర్బ వెంకటేశ్వర్ల నాయుడు కుటుంబానికి ఆ పార్టీ పాడేరు మండల నాయకులు బాసటగా నిలిచారు. ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచన మేరకు పార్టీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కొంత నగదును సమీకరించి సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వెంకటేశ్వర్లనాయుడు కుటుంబ సభ్యులకు అందజేశారు. త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని వారు ఆకాంక్షించారు.

జీఎస్టీ సవరణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు

పాడేరు రూరల్: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కార్మిక శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి గోవింద్ కోరారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పాత్త బస్టాండ్ నుంచి ప్రధాన రహదారి మీదుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు అవగాహన బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గదలతో కొనుగోలుదారులకు ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నా రు. స్వదేశీ వస్తువులు కొనుగోలు చేయడం వల్ల భారత ఆర్థిక పరిపుష్టికి ఎంతో తోడ్పాటు అందుతుందన్నారు. సూపర్ జీఎస్టీ 2.0 ప్రయోజనాలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ అధికారి సూర్యనారాయణ, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రమేష్, వివిధ శాఖ అధికారులు ప్రసాద్, మన్మథరావు, సన్యాసిరావు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పునర్నిర్మాణం కోసం ఆందోళన



పనసలో కోతకు గురైన కల్వర్టు వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ పనస గ్రామంలో కోతకు గురై ప్రమాదకరంగా తయారైన కల్వర్టును పునర్నిర్మించాలని సోమవారం స్థానిక గిరిజనులు ఆందోళనకు దిగారు. పాడైన కల్వర్టు వద్ద వైఎస్సార్‌సీపీ మండల నేతలు, గిరిజనులు నూతన కల్వర్టు కోసం ఆదికర్మ యోగి కార్యక్రమం ద్వారా పీఎం జన్‌మన్ నిధులు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు దేవా, నీలకంఠం మాట్లాడుతూ పనస కల్వర్టు కోతకు గురికావడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోందన్నారు. రెండు వైపులా కల్వర్టు పాడైపోవడంతో పాటు కింద భాగంలో రాళ్లు తేలిపోయి, పటుత్వం పూర్తిగా కోల్పోయిందన్నారు. ఏ క్షణమైనా కల్వర్టు కుంగిపోయే ప్రమాదం ఉందని, అదే జరిగితే పనస నుంచి మొక్కపుట్టు, సంగడ, ఓబైబీరు గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉందని వాపోయారు. కల్వర్టు పరిస్థితిని పలుమార్లు అధికారులకు తెలియజేసినా స్పందన లేదని, తక్షణమే నూతన కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలపై ఫిర్యాదు



తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందిస్తున్న పీసా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు

వీఆర్‌పురం: రేఖపల్లి గ్రామంలో గ్రామకంఠం, ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా సాగుతున్న పలు అక్రమ కట్టడాలపై తహసీల్దార్ సరస్వతికి సోమవారం పీసా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిక్కాల బాలకృష్ణ, సారా పాండురాజు, వెటకాని సూరిబాబు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామకంఠం భూముల్లో అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలన్నారు. రేఖపల్లి కోట మైసమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ వృక్షాలను పొక్లెయిన్‌తో తొలగించి ఇళ్ల స్థలాలుగా మార్చి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బేతి సారయ్య, వెటకాని రాముడు, మాజీ సర్పంచ్ బేతి నాగేశ్వరరావు, కొట్టి ముత్యాలరావు, వీర్ల శ్రీనివాసరావు, బేతి రాజు, బేతి నరసింహారావు, గంగుల నాగేశ్వరరావు, వెటకాని బాలు, నూతి దినేష్, బేతి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణపై పోస్టర్ విడుదల



గొలుగొండలో కోటి సంతకాల సేకరణపై పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గొలుగొండ: మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం కాకుండా మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో బాగంగా గొలుగొండలో వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సుర్లగిరిబాబు, మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షులు కొరుప్రోలు పాణీశాంతారామ్, జల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాతతోపాటు ఇతర నాయకులు మాట్లాడుతూ మెడికల్ కళాశాలను ప్రైవేట్ పరం అయితే పేదవాడికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దీనిపై మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు, నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో సంతకాలు సేకరణ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ సుర్లబాజి, యూత్‌పార్టీ అధ్యక్షుడు రామకృష్ణనాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో భారీ వర్షం



నెల్లిమెట్ల కాలనీ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న చిన్నేరు వాగు

సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా ఆంధ్ర–ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. జీకే వీధి మండలం దారకొండలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడడంతో జన జీవనం స్తంభించిపోయింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ కాస్తూ ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వస్తూ సాయంత్రం ఉరుములు మెరుపులతో వర్షాలు పడుతుండడంతో గిరిజనులు బెంబేలెత్తిపోతున్నారు. సోమవారం కురిసిన వర్షానికి సీలేరు, దారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవులు, తదితర ప్రాంతాల్లో పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. గ్రామాల్లోని కాలవలు మురుగునీటితో పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. దారకొండ వంతెన బ్రిడ్జికి దిగువ ప్రాంతానికి నీరు పోయే మార్గం లేకపోవడంతో పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలోకి వర్షపు నీరు చేరింది. వర్షం తగ్గాక విద్యార్థులను ఇంటికి పంపేశారు. ఘాట్ రోడ్డులో చాలాచోట్ల రహదారి కోతకు గురైంది. పిల్లి గెడ్డ, చిన్న గంగవరం అగ్రహారం వాగులు ఉప్పొంగాయి. దారకొండ ఘాట్ రోడ్‌లో ఉన్న గోతులు వర్షపు నీటితో నిండిపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కొయ్యూరులో కుండపోత వర్షం

కొయ్యూరు: భారీ వర్షానికి కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లపై వర్షం నీరు చెరువును తలపించేలా ఉంది. సోమవారం మధ్యాహ్నం నుంచి దాదాపుగా రెండు గంటల పాటు కొయ్యూరు చుట్టు పక్కల ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. దీంతో కొయ్యూరు, కాకరపాడు కాలువలు పొంగిపొర్లాయి. ఆదివానం రాత్రి కూడా గంటన్నర పాటు భారీ వర్షం పడింది. రోజూ వర్షాలు పడుతుండడంతో వరిచేలు నీటిలోనే ఎక్కువగా ఉండి తెగుళ్ల బారిన పడుతున్నాయి.

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. దాదాపు రోజంతా వర్షం కురుస్తూనే ఉండడంతో జన జీవనం స్తంభించింది. మండలంలోని కిర్రాబు, నెల్లిమెట్ల గ్రామాల సమీపం నుంచి చిన్నేరు వాగు వరద నీటితో పోటెత్తింది. దీంతో నెల్లిమెట్ల, నెల్లిమెట్ల కాలనీల మధ్య ప్రధాన రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రం రాజవొమ్మంగి నుంచి ఈ గ్రామాల మీదుగా లబ్బర్తి, లాగరాయి, కింర్ర, అనంతగిరి, చీడిపాలెం తదితర పది గ్రామాలకు వెళ్లాల్సిన ఆటోలు, తదితర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితులు ఉన్న వారు చుట్టూ తిరిగి వెళ్లారు. అప్పలరాజుపేట వద్ద వట్టిగెడ్డ వాగుకు వరద పోటెత్తడంతో అదనపు జలాలు పొర్లు మదుము ద్వారా దిగువకు ప్రవహిస్తున్నాయి. వ్యవసాయ పనులకు ఆటంకం కలిగింది.



ఉధృతంగా ప్రవహిస్తున్న కొయ్యూరు కాలువ



దారకొండ గ్రామంలో కురుస్తున్న భారీ వర్షం



పాఠశాలలోకి చేరిన వర్షపు నీరు

వర్షంలోనూ రైతుల రిలే దీక్షలు



దీక్ష చేస్తున్న మహిళలు

గూడెంకొత్తవీధి: వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రైతులు రిలే దీక్షలను కొనసాగిస్తున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు కలిగిన రైతులు తమ తోటలను కోల్పోయారు. దీనికి సంబంధించి పరిహారం రాకపోవడంతో ఎనిమిది రోజులుగా రిలే దీక్షలు కొనసాగిస్తున్నారు. దీనిపై ఇన్‌చార్జి సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో తిరుమణి, శ్రీపూజ రైతులతో మాట్లాడారు. త్వరలో పరిహారం వస్తుందని హామీ ఇచ్చారు. అయినా రైతులు దీక్షలను విరమించలేదు. సోమవారం వర్షం కురుస్తున్నా దీక్ష కొనసాగించారు.

భరింగులలో సమస్యలు పరిష్కరించాలి



భరింగులలో అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ముంచంగిపుట్టు: మండలంలోని కరిముఖిపుట్టు పంచాయతీ భరింగుల గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సీపీఎం మండల నాయకులు నారాయణ, సీతారాం డిమాండ్ చేశారు. సోమవారం భరింగులలో వారు పర్యటించారు. సీసీరోడ్డు, బీటీ రోడ్డు, తాగునీరు వంటి సమస్యలను గ్రామ గిరిజనులు వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భరింగుల గ్రామానికి తారు రోడ్డు వెంటనే నిర్మించాలని, 800 మీటర్ల సీసీ రోడ్డు మంజూరు చేయాలని, తాగునీటి పథకం ఏర్పాటు చేసి నీటి కష్టాలు తీర్చాలని కోరారు. లేని పక్షంలో గిరిజనులతో కలిసి మండల కేంద్రంలో ఆందోళన చేస్తామని సీపీఎం నేతలు హెచ్చరించారు.

తెగుళ్ల నివారణపై అవగాహన అవసరం



వరి పొలంలో రైతులకు సూచనలు చేస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: వరి పంటలో వచ్చే తెగుళ్లపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసా య సిబ్బంది సూచించారు. సోమవారం రింతాడ రైతు సేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు పలు సూచనలు చేశారు. దగ్గరలో ఉన్న వరి పొలాన్ని సందర్శించి, రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు.

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు పాటించాలి



పెట్రోల్ బంక్‌లో తనిఖీలు చేపడుతున్న తహసీల్దార్ లక్ష్మీదేవి, సీఎస్‌డీటీ రవి

దేవరాపల్లి : పెట్రోల్ బంకుల్లో కచ్చితంగా నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవి హెచ్చరించారు. ఈ మేరకు దేవరాపల్లిలోని పెట్రోల్ బంక్‌ను సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ రవితో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్ బంక్‌లో రికార్డులను, మరుగుదొడ్లు, తాగునీటి వసతి తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పెట్రోల్ బంకుల్లో స్టాక్ రిజిస్టర్లు, అమ్మకం, కనుగోలు వివరాల రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని సూచించారు. పెట్రోల్ కొలతల్లో తేడాలు ఉన్నట్లు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.